నా సాహితీ జీవనంలో

# జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాదిగారు మొట్టమొదటిసారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

The only thing I was fit for was to be a writer, and this notion rested solely on my suspicion that I would never be fit for real work, and that writing didn't require any.

***- Russell Baker***

# శ్రీ గజ్జెల మల్లారెడ్డి

**ఈనాడులో మల్లారెడ్డి రాసిన ‘పుణ్యభూమి‘ కాలం చాలా పాపులర్.** ‘తెలుగునాట భక్తిరసం/తెప్పలుగా పారుతోంది/డ్రైనేజ్ స్కీం లేక/డేంజర్ గా పారుతోంది‘ అనే ఆయన కవిత చాలా పాపులర్ అయింది. మల్లారెడ్డిగారు ‘ఈనాడు‘ వదిలేసాక పుణ్యభూమి గేప్‌ని ఎవరూ అంత సమర్ధవంతంగా నింపలేకపోయారు.

కవిత్వంలో శ్రీ చైతన్య ప్రసాద్ శ్రీ గజ్జెల మల్లారెడ్డి శిష్యుడు. శ్రీ గజ్జెల మల్లారెడి ఉదయం ఎడిటర్‌గా వచ్చాక ఓ రోజు మల్లారెడ్డిగారి గదిలోకి తీసుకెళ్ళి వారి ప్రియశిష్యుడు శ్రీ చైతన్య ప్రసాద్ నన్ను వారికి పరిచయం చేసారు. ఆ తర్వాత నాలుగైదుసార్లు ఆయన్ని కలిసాను. అప్పటికే ఆయన కమ్యూనిజం భావజాలంలోంచి బయటపడ్డ మల్లారెడ్డి. బాహాటంగానే కమ్యూనిజాన్ని విమర్శించేవారు. ఆయన దేవుడ్ని నిరాకరించడం ఆగిపోయింది. తను ఒకప్పుడు గట్టి కమ్యూనిస్ట్‌నని, ఇప్పుడు కాదని చెపుతూ ఇలా అన్నారు.




"మనిషి ముప్పైలోగా కమ్యూనిస్ట్ కాకపోతే అతని హృదయంలో ఏదో సమస్య ఉన్నట్లు. ముప్పై ఏళ్ళు కమ్యూనిస్ట్‌గా కొనసాగాక కూడా ఇంకా అదే ప్రభావంలో ఉంటే అతని మెదడుకి ఏదో సమస్య ఉన్నట్లు."

ఆ తరం ఎడిటర్స్‌లా మల్లారెడ్డిగారు నిబద్ధత, అంకిత భావంగల ఎడిటర్. ఆయనతో ఉదయం మూసేసే చివరి దశలో నాకు పరిచయం కలిగింది. ఇంకొంచెం ముందుగా పరిచయం కలిగితే బావుండేది అనిపించేది ఆయన మాటలు వింటూంటే. ఏదైనా సరే నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, సూటిగా మాట్లాడేవారు.

'ఉదయం' మూత పడటానికి శ్రీ రామోజీరావు కారణం అని అప్పట్లో ఓ వదంతి వచ్చింది. మాగుంట సుబ్బరామిరెడ్డిగారిది నెల్లూరు. ఆయన ప్రధాన వ్యాపారం లిక్కర్ వ్యాపారం. హోల్ సేల్ బిజినెస్. చాలా రీటైల్ వైన్ దుకాణాలు కూడా ఉండేవనుకుంటా. ఆయన లిక్కర్ వ్యాపారం ద్వారా వచ్చే ఫండ్స్‌ని 'ఉదయం' నడపడానికి ఉపయోగిస్తున్నారు. కాబట్టి ఆయన లిక్కర్ వ్యాపారాన్ని దెబ్బ తీస్తే ఇక ఉదయానికి ఫండ్స్ ఆగిపోయి అది మూతపడుతుందన్న ఆలోచనతో రామోజీరావు 'ఈనాడు'లో మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం కల్పించి, లిక్కర్ వ్యాపారాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోంచి రాష్ట్రప్రభుత్వం చేతుల్లోకి వెళ్ళేలా చేసారని అనేక మంది నోట విన్నాను. ఇప్పటికీ ఈనాడు ప్రత్యర్ధి పత్రిక 'సాక్షి'లో ‘ఓ దిన పత్రిక మూతపడటానికి కారణం అయిన రామోజీరావు‘ అంటూ రాస్తూంటారు.

'ఉదయం' సంస్థ మూసేసే నాటికి నాకు దాని యాజమాన్యం నుంచి 'శివరంజని', ఉదయం వీక్లీ, డైలీలలో ప్రచురించిన నా రచనలకి మొత్తం పదిహేడువేల రూపాయలు రావాల్సి ఉంది. దాని జనరల్ మేనేజర్ సి.వి.సుబ్బారావు 'సితార' సినిమా వారపత్రిక మేనేజర్‌గా పనిచేసే నాటి నుంచి పరిచయం కాబట్టి ఆయన్ని కలిసి పారితోషికం గురించి అడిగాను. ఇవ్వగలిగి ఉండి కూడా ఆయన ఆ బాకీ సొమ్ముని ఇవ్వలేదు.

అప్పట్లో 'ఉదయం'లో పని చేసిన రాజా ఓ జోక్ చెప్పారు. ఉదయం ఆంధ్రప్రదేశ్‌లో ఏడు ఎడిషన్స్ ప్రచురించేది. ‘పాత కాగితాలు కొంటాం‘ అంటూ అటుగా వెళ్ళే పాత న్యూస్ పేపర్లని కొనే అతనితో సబ్ ఎడిటర్ బుర్రా సుబ్రమణ్యం సరదాగా ‘ఏడు ఎడిషన్లు ఉన్నాయి. కొంటావా?‘ అని అడిగేవారుట. ఇతను చలసాని ప్రసాదరావు దగ్గర ఈనాడు ఆదివారం అనుబంధానికి సబ్

ఎడిటర్‌గా పని చేసేప్పుడు 1974 నుంచి నాకు పరిచయం. నా చేతి రాతిని అర్థం చేసుకోగలరు కాబట్టి కంపోజిటర్స్ పంపే నా ప్రూఫ్‌లని బుర్రా సుబ్రమణ్యమే చూసేవారు. ఆ తరువాత హిమాయిత్ నగర్ నుంచి వచ్చిన ఓ వార పత్రికకి (పేరు గుర్తులేదు) శ్రీ బుర్రా ఎడిటర్ గా పనిచేసినప్పుడు ఓ సీరియల్ రాసాను. అతను గతించి చాలా ఏళ్ళు దాటింది.

'ఉదయం' మూతపడ్డాక గజ్జెల మల్లారెడ్డి అధికార భాషా సంఘంలో అధ్యక్షుడిగా అనుకుంటా చేరారు. మల్లారెడ్డిగారు తర్వాత బౌద్ధమతానికి చెందిన కొన్ని పుస్తకాలకి తెలుగులో అనువాదాలని చేసారు. ఆనంద బుద్ధవిహార్ అనే సంస్థకి అని గుర్తు.

చైతన్య ప్రసాద్ ద్వారా నాకు ఉదయంలో పరిచయం అయిన వారిలో మరొకరు శ్రీ బాల్‌రెడ్డి.

●●●

## శ్రీ బాల్‌రెడ్డి

ఉదయం సంస్థ 'శివరంజని' అనే సినిమా వారపత్రికని తీసుకువచ్చేది. దాని ఎడిటర్ శ్రీ బాల్‌రెడ్డి. వీక్లీ ఇన్‌ఛార్జ్ శ్రీ చైతన్య ప్రసాద్ టేబుల్ దగ్గరకి శ్రీ బాల్ రెడ్డి టేబుల్ పక్కనుంచే వెళ్ళేవాడిని. ఓసారి చైతన్య ప్రసాద్ బాల్‌రెడ్డిని పరిచయం చేసాక శివరంజనికి ఏదైనా శీర్షిక రాయమని కోరారు. ఆయన టేబుల్ మీదున్న సినిమా స్టిల్స్‌ని చూసి వాటి వెనక హాస్య వాఖ్యలని రాసి చూపించాను.




వెంటనే అవి చదివి నచ్చిందని చెప్పడంతో ఆ శీర్షిక పేరు గురించి చర్చించాము. ఆయన సూచించిన 'డైలాగ్ కొట్టు గురూ' ఫైనలైజ్ అయింది. అది చాలా కాలం నడిచింది. మొదట్లో పారితోషికం సక్రమంగా ఇచ్చినా శ్రీ బాల్‌రెడ్డి తర్వాత తర్వాత ఆ విషయం పట్టించుకోకపోవడంతో ఆ శీర్షిక రాయడం ఆపేసాను.




మద్రాస్‌లో 'సితార' పత్రికకి రిపోర్టర్‌గా బాల్‌రెడ్డి పని చేసేప్పుడు అప్పట్లో సితార ఇచ్చే జీతం నెలకి పన్నెండు వందలు. మాగుంట సుబ్బరామిరెడ్డి సోదరుడు, నిర్మాత మాగుంట సుధాకర్ రెడ్డితో పరిచయం వల్ల, రెండున్నర వేల జీతంతో బాల్ రెడ్డి ఉదయం సంస్థలో శివరంజనికి చీఫ్ రిపోర్టర్‌గా మద్రాస్ నుంచి పనిచేసేవారు. 1990లో 'శివరంజని' ఎడిటర్‌గా హైదరాబాద్‌కి వచ్చారు. 1995లో ఉదయం సంస్థ మూసేసేదాకా అక్కడ పని చేసారు. అప్పట్లో 'తేనెటీగ' అనే సినిమా వివాదంలో చిక్కుకున్నప్పుడు దాని డైరెక్టర్ నందకుమార్‌ని, నన్ను ఇంటర్వ్యూ చేసి సెంటర్ స్ప్రెడ్‌లో ప్రచురించారు. పాపులర్ హీరోల కలర్ చిత్రాలని పోస్టరుగా అతికించుకునేలా శివరంజని ద్వారా పాఠకులకి అందించారు. నాకు గుర్తులేదు కానీ ఇలాంటి అనేక కొత్త శీర్షికలతో పాఠకులని ఆకర్షించి

లార్జెస్ట్ సర్క్యులేటెడ్ ఫిల్మ్ వీక్లీగా చేసారు. బాల్‌రెడ్డి పత్రికని నిత్యనూతనంగా, అనేక కొత్త ఆలోచనతో తెచ్చి సమర్ధవంతమైన ఎడిటర్‌గా గుర్తింపు పొందారు.

1996లో 'డి ఫర్ డెత్' అనే నా నవలని అదే పేరుతో తీసిన టీ.వి సీరియల్‌కి దర్శకత్వం వహిస్తూ, జూబ్లీ హిల్స్‌లో ఓ చెరువు ఒడ్డున షూటింగ్‌కి వెళితే శ్రీ బాల్‌రెడ్డి ఈ టీవి అవుట్ డోర్ యూనిట్ వేన్‌తో అక్కడ కనిపించారు. 'శివరంజని' తర్వాత తను ఈ టీవీలో ఫ్రీలేన్సర్‌గా సినిమా రౌండప్, మరి కొన్ని సినిమా శీర్షికలని జీతంకాక పారితోషికం తీసుకుని చేస్తున్నానని చెప్పారు. నన్ను అతను చిత్రీకరించి నేను డైరెక్ట్ చేయడం ప్రసారం చేస్తారని భయపడ్డాను కూడా. ఐతే అతను నా సెంటిమెంట్‌ని గౌరవించి ఆ పని చేయలేదు.

1996లో దాసరి నారాయణరావుగారు మళ్ళీ 'మేఘసందేశం' అనే సినిమా పత్రికని, 'బొబ్బిలిపులి' అనే పొలిటికల్ వీక్లీని ఆరంభించినప్పుడు ఎలక్ట్రానిక్ మీడియాతో విసిగిపోయి, ప్రింట్ మీడియా మీద గల ఆసక్తితో శ్రీ బాల్‌రెడ్డి 'మేఘసందేశం'లో చేరారు. 'మేఘసందేశం' కూడా మూసేసాక 1998లో 'నంబర్ ఒన్' అనే స్వంత సినిమా వార పత్రికని చిరంజీవి బేకింగ్‌తో ఆరంభించారని విన్నాను. దానికి నా చేత రాయిస్తారని నేను భావించాను కానీ అలా జరగలేదు. శ్రీ బాల్‌రెడ్డికి సినిమా జర్నలిజం మీద మంచి పట్టు ఉంది కాబట్టి అనతికాలంలోనే అది అన్ని సినిమా వారపత్రికల్ని అధిగమించింది.

2003లో ఉత్తరార్ధంలో ఓ రోజు ఫోన్ చేసి మా ఇంటికి కార్టూనిస్ట్ శ్రీ జయదేవ్‌తో కలిసి వచ్చారు. శ్రీ జయదేవ్ మద్రాస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆయన కార్టూన్లలోని సంతకమే నాకు పరిచయం తప్ప అవి గీసిన ఆయన చేతిని, ఆయన్ని చూడటం అదే మొదటిసారి. ఆయన్ని బాల్‌రెడ్డి పరిచయం చేసాక హైదరాబాద్‌కి ఒక్కడే షిఫ్ట్ అయి వచ్చానని శ్రీ జయదేవ్ చెప్పారు. 'నంబర్ ఒన్'తో పాటుగా తను 'జయం' వీక్లీని, 'దైవం' మంత్లీని తెస్తున్నానని, తనకి సినిమా జర్నలిజం తప్ప సోషల్ వీక్లీ జర్నలిజం తెలీదని, అందుకని మద్రాస్‌లో ఉండే జయదేవ్‌ని వాటికి ఎడిటర్‌గా తీసుకున్నానని, 'జయం' వీక్లీకి మంచి సీరియల్ కావాలని శ్రీ బాల్‌రెడ్డి నన్ను కోరారు. స్వాతి వీక్లీకి ప్రత్యమ్నాయంగా ఇంకో బలమైన వీక్లీ లేదని, అలాంటి ఇంకో వీక్లీకి మార్కెట్లో స్థానం ఉండబట్టి 'జయం'ని, 'భక్తి' అనే మాసపత్రిక నెలకి లక్షకాపీలు అమ్ముతోంది కాబట్టి అలాంటి పత్రికకి కూడా పాఠకుల ఆదరణ ఉందని తేలింది కాబట్టి 'దైవం'ని తెస్తున్నానని కూడా చెప్పారు.

"ఒక్క ఆధ్యాత్మిక సీరియల్ తప్ప నేను అన్ని రకాలు రాసాను. అది రాయాలని అనుకుంటున్నాను" చెప్పాను.


శ్రీ బాల్‌రెడ్డి

"అదే రాయండి. హిట్టయితే తొలి ఆధ్యాత్మిక హిట్ సీరియల్ వేసిన ఘనత నాకు దక్కుతుంది. హిట్ కాకపోతే ఫెయిల్యూర్ సీరియల్ రాసినందుకు పాఠకులు మిమ్మల్నే తిట్టుకుంటారు" వివరణ ఇచ్చారు.

దానికి నేను పెట్టిన పేరు 'సమాప్తం'. దాని సంస్కృత అర్ధం తెలుగు అర్ధం కాదు. దేవుడికి సమీపంలో ఉండటం అని. అయినా సెంటిమెంట్స్ అధికంగా గల శ్రీ బాల్‌రెడ్డి ఆ పేరుని అంగీకరించలేదు. ఇంకోటి ఆలోచించమని కోరారు.

బాల్‌రెడ్డి నన్ను చూసి చాలా ఆశ్చర్యపోయారు. నాలో చాలా మార్పుని గుర్తించానని చెప్పారు.

"మల్లాదిగారు. మీరు ఆధ్యాత్మిక జీవితం గడుపుతున్నారని విన్నాను కానీ మీలో ఇంతటి మార్పుని ఊహించలేదు నేను. చాలా సాత్వికంగా మారారు" అని ఆశ్చర్యపోయారు. నాలో ఈ మార్పు ఎలా వచ్చింది అని అడిగి రెండు గంటల పైనే నేను మాట్లాడేది విని తెలుసుకున్నారు. చివర్లో జయదేవ్‌గారిలో వచ్చిన పని వదిలి ఇదేమిటా అని కొంత అసహనం కలగడం కూడా గుర్తించాను.

ఆశ్చర్యంగా ఓ విషయాన్ని ఆ రోజు బాల్‌రెడ్డిగారు నాతో ఓపెన్‌గా చెప్పారు. ఉదయానికి నేను వచ్చేప్పుడు తనకి నేనంటే ఏహ్యాభావం ఉండేదని, ద్వేషించేవాడినని, ముఖ్యంగా నా నడక అతనికి నచ్చేది కాదని, అవసరం ఉన్న మేరకే మాట్లాడి వెళ్ళే నా స్వభావం

వల్ల నన్ను అహంభావిగా భావించేవాడినని నిజాయితీగా తన భావాలని ఏదీ దాచకుండా చెప్పారు. రాగానే నా నడకలోని మార్పుని గుర్తించానని, ఇప్పుడు అది గతంలోని నా నడకలా ద్వేషించేదిగా లేదని చెప్పారు.




మర్నాడు మళ్ళీ ఇద్దరూ వచ్చారు. వారి పత్రిక పేరే 'జయం' పెడితే ఎలా ఉంటుందని అడిగాను. అది ఆయనకి బాగా నచ్చి ఇకదాన్ని మార్చవద్దని కోరారు. 'దైవం' మంత్లీలో రామాయణాన్ని వాడుక భాషలో రాస్తానంటే సరే అన్నారు. 'మళ్ళీ చెప్పిన రామాయణం' పేర అది దైవంలో మూడేళ్ళకి పైగా సీరియల్‌గా వచ్చింది.

ఒకటి రెండు సార్లు 'స్వాతి' వారు 'జయం' పత్రికని బయటకి కనబడకుండా ఉంచేలా మేగజైన్స్ వెండర్స్ మీద ప్రెషర్ తెస్తున్నారని తమకి తెలిసిందని, ఇలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని బాల్‌రెడ్డి చెప్పారు. 'జయం' వీక్లీ ఐదు నెలలు మించి రాలేదు. 'దైవం', 'నంబర్ వన్' మాత్రమే మిగిలాయి.

2004 జూన్‌లో ఓ రోజు శ్రీనగర్ కాలనీ సమీపంలో గల సాగర్ సొసైటీలోని ఆయన ఆఫీస్‌లో శ్రీ బాల్‌రెడ్డి మీద చిరంజీవి అభిమానుల దాడి జరిగిందని, బాల్‌రెడ్డి పోలీస్‌లకి ఫిర్యాదు చేసారని పేపర్‌లో వార్తచదివాను. వెంటనే అతనికి ఫోన్ చేసి పరామర్శించాను. పత్రిక ఆఫీసుకి వచ్చి తన మీద ముగ్గురు దాడిచేసారని, ఒకర్ని పట్టుకుని పోలీస్‌లకి అప్పగిస్తే అతను తాము ముగ్గురం చిరంజీవి అభిమానులమని, చిరంజీవి మీద బాల్‌రెడ్డి 'నంబర్ ఒన్'లో రాసింది చదివి రియాక్ట్ అయి దాడి చేసామని అతను చెప్పాడని బాల్‌రెడ్డి చెప్పారు.

దీని నేపథ్యం వివరిస్తాను. 2004లో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో అశ్వనీదత్ తెలుగుదేశం పార్టీ తరఫున నిలబడ్డారు. దానికి చిరంజీవి, నాగార్జున లాంటి ఎందరో సినిమా సెలబ్రిటీస్ ప్రచారం చేసినా దత్ లక్ష ఓట్ల తేడాతో ఓడిపోయారు. దాన్ని విశ్లేషిస్తూ బాల్‌రెడ్డి 'సినిమా గ్లామర్ ఏమైంది?' అనే అంశం మీద 2004 జూన్‌లో తన పత్రిక 'నంబర్ ఒన్'లో ఓ వ్యాసం రాసారు.

చిరంజీవి ఈ దాడి సంఘటనని ఖండించకపోవడంతో అందుకు ఆయన ప్రేరణ ఉందని భావించారు. రెండు నెలల తర్వాత ఆగస్ట్‌లో చిరంజీవి పుట్టినరోజు వచ్చింది. తనని కొట్టించిన వ్యక్తి గురించి ఇంద్రుడు, చంద్రుడు అని రాయడం ఇష్టంలేదు. రాయకపోతే పాఠకులు అసంతృప్తికి గురవుతారు. పైగా పూర్వం చిరంజీవి ఫోటోలు అతను నటించిన నిర్మాతల నుంచి, ప్రొఫెషనల్‌గా ఇలాంటివి సరఫరా చేసే వారినుంచి పత్రికలకి ముఖచిత్రంగా వేయడానికి అందేవి. కానీ వాటి నియంత్రణ చిరంజీవి తీసుకోవడంతో 'నంబర్‌ఒన్'కి ఆయన్నే ఫోటోలు అడగాల్సిన పరిస్థితి. అందుకు బాల్‌రెడ్డి మనస్సాక్షి అంగీకరించలేదు. నాలుగువారాలకి ఓసారైనా చిరంజీవి ముఖచిత్రం తప్పనిసరిగా వేయాలి. లేదా పత్రిక అమ్మకాలు దెబ్బతింటాయి. ఇవన్నీ ఆలోచించి 'నంబర్ ఒన్'ని శ్రీ బాల్‌రెడ్డి మూసేసారు. శ్రీ బాల్‌రెడ్డి ఒరిజినాలిటీ గల చక్కటి సినిమా జర్నలిస్ట్ అయినా, బాగా నడిచే 'నంబర్‌ఒన్'ని మూసేయాల్సి రావడం దురదృష్టం అని నాకు అనిపించింది. మళ్ళీ ఫిలిం నగర్‌కి అతను వెళ్ళలేదు. సినిమా వారిని కలవలేదు. 'జయం' వీక్లీ, 'దైవం' మంత్లీ కూడా మూసేసాక కొద్దికాలానికి తిరిగి 'దైవం' మంత్లీని రివైవ్ చేసారు.

తర్వాత నెలకోసారి మా ఇంటికి వచ్చి నాతో ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడేవారు.

ఓ రోజు మా ఇంటికి వచ్చి తనతో ఓ అరగంట గడిపే సమయం ఉందా అని అడిగితే ఉందన్నాను. అతని కార్లో రామకృష్ణామఠానికి వెళ్ళిలోపల కొద్దిసేపు మౌనంగా కూర్చున్నాము. అరగంట తర్వాత నన్ను మళ్ళీ ఇంటి దగ్గర దింపి వెళ్ళిపోయారు. అదే మా ఆఖరి కలయిక.

'నంబర్ ఒన్' మూసివేయడం, 'జయం' వీక్లీలో నష్టం రావడం వల్ల బాల్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. బంజారా హిల్స్‌లోని కమలాపురి కాలనీకి, ఆ తర్వాత కూకట్ పల్లికి మారారు. ఆర్థికంగా తేరుకుని ఇప్పుడు హైదరాబాద్ శివార్లలోని దిండిగల్‌లో స్వంత ఆఫీస్‌ని కట్టుకుని 'దైవా'న్ని ప్రస్తుతం విజయవంతంగా నడుపుతున్నారు. తనకి ఈ ఆటుపోటుల వల్ల భగవంతుడి ఉనికి మీద అపారమైన నమ్మకం ఏర్పడిందని, తను ఇప్పుడు పూర్వం కన్నా ఎక్కువ మనశ్శాంతితో జీవిస్తున్నానని ఈ ఆర్టికల్ కోసం ఫోన్ చేసినప్పుడు చెప్పారు.

'మల్లాదిగారు! దైవం ఆరంభించినప్పుడు నాకు దైవభక్తి పెద్దగా లేదు. కానీ నేను పత్రికారంగంలో ఎదుర్కొన్న అనేక సమస్యల తర్వాత నాలో దైవం మీద విశ్వాసం పెరగసాగింది. అందుకని మీ దగ్గరకి వచ్చి ఆ విషయాలు విని ఏదైనా నేర్చుకోవాలని అనుకునేవాడిని. 'జయం'కోసం మీదగ్గరకి వచ్చినప్పుడు మీలోని మార్పుని నేను స్పష్టంగా గుర్తించాను. పూర్వం లేని తేజస్సు, సాత్వికత మీద మీతో ఈ ఇంటర్వ్యూని జయంలో ప్రచురించాను. దైవం మీద విశ్వాసం ఉంటే ఎలాంటి సమస్యలూ మనల్ని ఇబ్బంది పెట్టవని నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. మీ ద్వారా శ్రీశాంగారిలాంటి అనేకమంది ఆధ్యాత్మిక వేత్తలని కలుసుకున్నాను. మంచివాళ్ళతో తిరుగుతూంటే మనకి మంచి సంకల్పాలే కలుగుతాయి అని కూడా తెలుసుకున్నాను.' చెప్పారు.



కుటుంబ సభ్యులతో శ్రీ బాల్‌రెడ్డి

(From left to right : Daughter Vaishnavi, Balareddy, Wife Vijayalakshmi, Son Vishnu vardhanreddy, Daughter-in-law Lakshmana

ప్రస్తుతం 'దైవం' కాంప్లిమెంటరీ కాపీని నెలనెలా నాకు కొరియర్‌లో పంపుతూనే ఉన్నారు.

## శ్రీ గుడిపాటి



శ్రీ గుడిపాటి

'వార్త' డెయిలీలో నా మేనమామ పెద్ద అల్లుడు శ్రీకె.ఆర్.కె ప్రసాద్ నుంచి ఓ రోజు ఫోన్ వచ్చింది. తనెవరో చెప్పి ఐ.పి.ఎస్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైరయ్యాక తను వార్తలో చేరానని, వార్తకి ఏదైనా రాయమని కోరారు. ఓ రోజు మా ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలోని 'వార్త' ఆఫీస్‌లోని ఆయన దగ్గరకి వెళ్ళాను. శ్రీ కె.ఆర్‌కె. ప్రసాద్ నన్ను ఆ సంస్థ యం.డి గిరీష్ సంఘీ దగ్గరకి తీసుకెళ్ళి పరిచయం చేసారు. మాకు ఏమైనా రాయమని ఆయన కోరారు. మర్నాడు సప్లిమెంట్‌కి 'మల్లాది పేజీ' శీర్షికని రూపొందించి దాన్ని నిర్వహిస్తానని చెప్పాను. శ్రీ ఎ.బి.కె. ప్రసాద్‌కి దాన్ని చూపిస్తే ఆయన బావుందని ఒప్పుకున్నారు. ఎవరైనా అభ్యంతరం చెప్పే సెక్స్‌కాని, స్త్రీ, దళిత వాదాలకి వ్యతిరేకంగా కానీ రాయొద్దని సలహా ఇచ్చారు. అప్పట్లో వీరేంద్రనాథ్ ఉదయంలో రాసిన సీరియల్‌లో స్త్రీవాదానికి వ్యతిరేకంగా రాస్తే శ్రీ ఎ.బి.కెతో పరిచయం ఉన్న ఆ వాదం వారు ఆయనకి ఫిర్యాదు చేసారు. వెంటనే శ్రీ కె.ఆర్.కె ప్రసాద్ సండే సప్లిమెంట్‌ని చూసే శ్రీ గుడిపాటిని పిలిపించి ఆ శీర్షిక గురించి చెపితే, అది బావుంటుందని ఆయన చెప్పారు. శ్రీ ఎ.బి.కె వెళ్ళిపోయి శ్రీ కె. శ్రీరామచంద్రమూర్తి వచ్చినా ఆ రోజు నుంచి వరుసగా దాదాపు పదేళ్ళు 'మల్లాది పేజీ' శీర్షిక ఆదివారం సండే సప్లిమెంట్‌లో కొనసాగింది. 'ఓ మైగాడ్, భజగోవిందం, ఆధ్యాత్మిక చిన్న కథలు' అనే పుస్తకాలు ఆ శీర్షికలో నిర్వహించిన ఆర్టికల్స్‌లోంచి వేసాను. ఐదారు నెలలకి ఓ సారి శ్రీ కె.ఆర్.కె ప్రసాద్‌ని కలిసి మల్లాది పేజీ రెమ్యునరేషన్ అడిగితే ఒకటి, రెండు నెలలకి కానీ చెక్ వచ్చేది కాదు. నాలుగేళ్ళ క్రితం అనుకుంటా, శ్రీ కె.ఆర్.కె ప్రసాద్ వార్త నుంచి ఆంధ్రజ్యోతి గ్రూప్‌కి సి.ఈ.ఓగా వెళ్ళిపోయారు. దాదాపు ఎనభైయ్యవ పడిలో పడినా ఆయన తన కారుని తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళి అక్కడ పనిచేస్తున్నారు.

కమ్యూనిస్ట్ భావజాలం గల శ్రీ గుడిపాటి సిఈఓ నా బంధువు కాబట్టి నా శీర్షికని ఆపలేదనే అభిప్రాయంలో ఉండేవాడిని. ఒకటి రెండుసార్లు శ్రీ గుడిపాటితో చెప్పాకూడా, ఆ కారణంగా నా శీర్షికని కొనసాగించవద్దని, బాలేకపోతే శ్రీ ప్రసాద్‌తో ఏదో కారణం చెప్పి ఆపేస్తానని. ఆపద్దని ప్రతీసారి శ్రీ గుడిపాటి చెప్పారు. ఆ తర్వాత చెక్ అడగడానికి శ్రీ ప్రసాద్ లేరు కాబట్టి ఎప్పటికప్పుడు ఆ శీర్షిక నిర్వహణని మానేద్దామనుకునే వాడిని. సండే సప్లిమెంట్ ఎడిటర్ శ్రీ గుడిపాటి మానొద్దని పారితోషిక చెక్‌ని అకౌంట్స్ శాఖ వారితో మాట్లాడి ఏర్పాటు చేసేవారు. 2009లో ఓ రోజు గుడిపాటి ఫోన్ చేసి చెప్పారు.

"మీ శీర్షిక పాఠకుల నుంచి ఇంకా చాలా రెస్పాన్స్ ఉంది. ఐనా ఎడిటర్ శ్రీ టంకశాల అశోక్ దాన్ని ఆపేయమని చెప్పారు. సారీ! మా దగ్గర ఉన్న పెండింగ్ స్క్రిప్ట్ పూర్తయ్యాక దాన్ని ఆపేస్తున్నాం"

ఆపేసాక ఇక బేలన్స్ పారితోషికం రాదని భావించాను. కానీ ఆశ్చర్యంగా ఆ పారితోషికం చెక్‌ని శ్రీ గుడిపాటి నాకు పంపారు!

శ్రీమతి వసంత లక్ష్మి, శ్రీ దోర్భల శర్మ, శ్రీ రామిరెడ్డి సండే సప్లిమెంట్‌కి సబ్ ఎడిటర్స్. రామిరెడ్డికి పనికన్నా, ఎక్స్‌ట్రా కరికులర్ ఏక్టివిటీస్ ఎక్కువగా ఉండేవి. త్వరలోనే శ్రీ రామిరెడ్డి అక్కడ మానేసి శ్రీ సి.సి.రెడ్డి ఆరంభించిన 'మా భూమి' (అనుకుంటా) అనే వీక్లీకి ఎడిటర్‌గా వెళ్ళారు. మొదటి నుంచీ శ్రీ దోర్భల శర్మగారే నా దరిద్రపు చేతి రాతని చక్కగా అర్థం చేసుకుని తప్పులు లేకుండా టైప్ చేసేవారు. వార్తలో వచ్చిన నా సీరియల్స్‌ని కూడా. నేను శర్మగారిని స్వయంగా కలిసి స్క్రిప్ట్‌ని ఇచ్చేవాడిని. ఎప్పుడైనా అనుమానాలు ఉంటే ఫోన్ చేసి అడిగేవారు. ఏదైనా ఐటం ఏ కారణంగానైనా రిజెక్ట్ అయితే, కొత్తది ఫోన్‌లో అడిగి రాసుకుని టైప్ చేసేవారు. ఆయన రామ్ నగర్‌లో ఇంటి గృహప్రవేశానికి పిలిస్తే వెళ్ళాను.


25 ఆదివారం వార్త — మల్లాది పేజి — నిర్వహణ: మల్లాది వెంకటకృష్ణమూర్తి — 3 ఆగస్టు 1997

న (క) వ్వింపు

పిల్లల పజిల్-8

పిల్లలూ! ఈ కింది పజిల్‌కి సమాధానం తడితే వెంటనే కార్డుమీద రాసి పంపండి. కరెక్ట్ సమాధానం రాసిన వారిలో ఒకరిని లక్కీ డ్రా ద్వారా ఎంపికచేసి మల్లాది రచన 'సర్పదర్శిని'(రూ.20) పంపుతాం.

9 అంకె నెమలి లాంటిది. ఎందుకని?

పిల్లల పజిల్-6 సమాధానం

వైప్ వైపర్ స్త్రీ లింగం-ఎందుకంటే దానికి రిబ్బన్ వుంటుంది కాబట్టి. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన విజేత: ఎ.సుమలత, కళ్యాణిఖని, ఆదిలాబాద్. (వెంటనే వీరికి ప్రకటించిన బహుమతి పంపబడుతుంది)

ఫిల్మ్ క్విజ్-14

ఈ కింది ఫిల్మ్ క్విజ్‌లో కొన్ని సినిమాల పేర్లు దాగి వున్నాయి. వాటిని కరెక్టుగా రాసి పంపిన మొదటి వారికి మల్లాది నవల 'ఎల్ ఫర్ లవ్' (రూ.40) బహుమతిగా పంపించ బడుతుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ద | వి | ఆ | మా | ను | నే |
| యం | మ్మ | బొ | డి | గ | అం |
| మ | న్యా | యం | కా | వా | లి |
| ర | గి | నా | శం | జ | ల |
| నో | ర్థాం | డీ | దే | పూ | కి |
| మ | అ | రౌ | నా | ఇ | క్రో |

మిస్సింగ్ లెటర్-14

ఈ చతురస్రంలో వున్న మిస్సింగ్ లెటర్‌ను కనుక్కుని మాకు ఆ అక్షరం రాసి పంపండి. మొదటగా సమాధానం పంపిన వారికి రూ.15/ బహుమతిగా పంపబడుతుం

| | | |
|---|---|---|
| ర | చె | ఆ |
| సా | | డి |
| ద | టి | క |

పంపినవారు: రావుల జ్యోతిర్మయి హుజురాబాద్

ఔనా! నిజమేనా?

కష్టపడి పనిచేసే వాళ్ళకే విజయంలోని రహస్యం అసలు రహస్యమేకాదని తెలుస్తుంది.

టేకిట్ ఈజీ!

భర్త తాలూకు సామర్థ్యంకన్నా మనిషిలో సెక్స్ కోరిక ఎక్కువ కాలం వుండటం తమాషా కాదా?!

-షేక్స్ పియర్ (హెన్రీ ఫోర్త్‌లో)

మిస్సింగ్ లెటర్-12 సమాధానం

రు ఈ సమాధానం మొదట అందేలా మాకు పంపిన వారు: పి.శ్రీధర్, జయశ్రీ హోస్టల్, రాంనగర్, కరీంనగర్ (వెంటనే వీరికి బహుమతి మొత్తం రూ. 15 /లు ఎం.ఓ. పంపబడుతుంది)

ఫిల్మ్ క్విజ్-12 సమాధానాలు

పాతాళభైరవి, భయం భయం, శారద, సాక్షి, భలే మామయ్య, ఆరంభం, దాసి, కంచుకోట, విజృంభణ, భైరవి

కరెక్ట్ సమాధానాలు రాసి పంపిన మొదటి విజేత: జి.బి.ఎస్.రావు, కె.లంక, విజయవాడ (వెంటనే వీరికి ప్రకటించిన బహుమతి పోస్టులో పంపబడుతుంది.)

ఫోటోకి పల్లవి-14

ఈ బొమ్మను చూస్తే ఓ తెలుగు సిని మా పాటకి పల్లవి గుర్తొస్తుంది. దాన్ని కరెక్టుగా రాసి వెంటనే మాకు పంపండి. మొదటగా అందిన సమాధానం పంపిన వారికి మల్లాది 'డ్రింకింగ్ జోక్స్' (రూ.20) బహుమతిగా పంప బడుతుంది.

ఫోటోకి పల్లవి-12 సమాధానం

"రక్తంతో నడుపుతాను రిక్షాను, నా రక్తమే నా రిక్షకు పెట్రోలు...."

ఈ సమాధానం మాకు అందించిన మొదటి విజేత: ఎం.ఎ.సత్తార్, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా. (వెంటనే వీరికి ప్రకటించిన బహుమతి పోస్టులో పంపబడుతుంది)

విదేశీ వి 'చిత్రం'

వారానికి 130 డాలర్ల చొప్పున హాలీడే రిసార్ట్‌లో టాయ్ లెట్స్ శుభ్రపరిచే ఉద్యోగం చేస్తోంది కెరిబీన్ ఐలాండ్‌కి చెందిన లిండా హిల్(48). రోజూ ఉదయం 6 గంటలకే నిద్ర లేస్తుందామె. ఈమెకి లాటరీల పిచ్చి వుంది. ఆమె కొన్న టికెట్‌కి 30లక్షల డాలర్లు వచ్చాయి. అయినా లిండా జీవన విధానంలో ఎలాంటి మార్పులేదు. తన ఉద్యోగాన్ని వదులుకోలేదు. తనకి లాటరీలో ఆ డబ్బు వచ్చిందని రాత్రి 11 గంటలకి తెలిసింది లిండాకి. మర్నాడు ఉదయం ఆమె యథావిధిగా తన డ్యూటీకి హాజరవడం అందర్నీ ఆశ్చర్య పరిచింది. లిండా, ఆమె భర్త అలన్ బేకర్(55)లు తమ పాత కారును అమ్మి ఓ ఫోర్డు కారు కొన్నారు. ఇంతకుమించి వాళ్ళే ఆ మొత్తంతో ఇతరత్రా ఏమీ అనుభవించలేదు. "ఆ డబ్బు మా జీవన విధానాన్ని శాసించలేదు." అంటాడు భర్త అలెన్. లిండా మాత్రం " గతంలో వెకేషన్‌కి వచ్చిన అతిథులు నాకు టిప్ ఇచ్చే వారు. కాని నేనెవరో తెలిసాక ఇప్పుడు నన్నే టిప్ అడుగుతున్నారు." అంటుంది నవ్వుతూ.

ఈవారం వివిధ శీర్షికలకు సమాధానాలు 17.8.97నాటి 'ఆదివారం వార్త'లో ప్రచురించబడతాయి.

రచయితగా నేను వివిధ పత్రికలో ఏభై దాకా శీర్షికలని నిర్వహించాను. వాటిలో దాదాపు పదేళ్ళపైనే నడిచిన శీర్షిక మల్లాది పేజీ. ఇప్పటికీ కొందరు పాఠకులు నా దగ్గర దాని ప్రస్తావన తెస్తూంటారు. ఒక్క పేజీలో కేవలం కాలక్షేపం కోసం పన్నెండు వైవిధ్యంగల శీర్షికలు నిర్వహించడంతో అది అన్ని వర్గాల పాఠకులని ఆకట్టుకుంది. విసుగు పుట్టకుండా ఉండడానికి ఆ పేజీని సదా మానిటర్ చేస్తూ కొన్నిటిని తీసేసి కొత్తవి ప్రవేశపెట్టేవాడిని. ఆ పేజీ వరకు నాకు పూర్తి స్వతంత్రం ఉండేది. ఐనా శ్రీ గుడిపాటి గారికి కారణం చెప్పి, ఆయన అనుమతితో శీర్షికల్లో మార్పులు చేసేవాడిని. ఇంకా ఇంటర్‌నెట్ అందుబాటులో లేని ఆ రోజుల్లో నేను అమెరికా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ది నేషనల్ ఎంక్వయిరర్, రాష్ట్రపతి రోడ్‌లో బైబిల్ హౌస్ ప్రాంతంలోని ఓ బుక్ స్టోర్‌లో ముందు డబ్బు కడితే తెప్పించి ఇచ్చే బ్రిటిష్ వారపత్రికలు వీకెండ్, టిట్‌బిట్స్ నుంచి ఈ శీర్షికలని డిజైన్ చేసేవాడిని. ఫోటోతో విదేశీ విచిత్రం, సినిమా క్విజ్, మూడు కొంటె ప్రశ్నలు, టంగ్ ట్విస్టర్, టేకిట్ ఈజీ (సెక్స్ కోట్) జోక్స్, ఇట్స్ ఏ ఫాక్ట్, ఇది మీకు తెలుసా?, పిల్లల పజిల్, ఔనా! నిజమేనా?, ఆర్ట్ ఆఫ్ లివింగ్, గంగోదకం మొదలైన ఆ పేజీలోని ఒక్కో ఐటంని ఒక్కోపేజీగా దాదాపుగా అన్ని సండే

సప్లిమెంట్స్‌లో ఇంటర్‌నెట్ లోంచి తీసుకుని ఇస్తున్నారు.

సందర్భం వచ్చింది కాబట్టి ఇక్కడ ఓ విషయం ప్రస్తావిస్తాను. ఇంటర్‌నెట్‌ని ఉపయోగించుకోవడం మొదలయ్యాక సండే సప్లిమెంట్‌లన్నీ ఒకే మూసలో వస్తున్నాయి. తరచు ఓ సండే సప్లిమెంట్‌లో వచ్చిన ఐటం తర్వాత ఇంకో సండే సప్లిమెంట్‌లో ఓ కథ, ఎప్పుడైనా సాధారణ పాఠకుల ప్రయాణ విశేషాలు, వారఫలాలు తప్ప బయటి రచయితలవి ఏమీ వేయడంలేదు. సిబ్బందే ఇంటర్‌నెట్‌లోవి చూసి రాసేయడంతో పారితోషికం బడ్జెట్ ఆదా అవచ్చు. కాని, పాఠకుడికి అందులో పనికి రాని వింత పరిజ్ఞానాన్ని అందిస్తున్నారే తప్ప 'గుండె తడి' గల, సాహితీ విలువలు గల, మానవతా విలువలు గల, గుర్తుండిపోయే మేటర్‌ని ఇవ్వలేకపోతున్నారు. ఫోటోలు కూడా స్పేస్ ఆదా చేయడానికి చిన్నవిగా వేయడంతో, పైగా న్యూస్ ప్రింట్ మీద ఫోటోలు సరిగ్గా రిజిస్టర్ కావు కాబట్టి ఇంటర్‌నెట్‌లో చూసిన ఫీల్ అచ్చయిన పేజీలో చూస్తే రాకపోవడం కూడా నేను గమనించాను.

తండ్రికి కమ్యూనిస్ట్ నేపథ్యం ఉండటంతో చిన్నప్పటినుంచీ శ్రీ గుడిపాటికి కమ్యూనిస్ట్ భావజాలం సుపరిచితం. సూర్యాపేట వాస్తవ్యుడు అయిన వీరు వార్త సండే సప్లిమెంట్ ఎడిటర్‌గా పనిచేస్తూనే, 'పాలపిట్ట' అనే విభిన్నమైన మాసపత్రికని కూడా తీసుకువస్తున్నారు.

***(మిగిలిన జ్ఞాపకాలు వచ్చేనెల)***

Click here to share your comments on this story